## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే


భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మే 29: పట్టణానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు బొడ్డు వీరేశ్ బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. గురువారం పట్టణంలో జరిగిన అంత్యక్రియలకు ఎమ్మెల్యే హాజరై భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ టౌన్ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, ముస్త్యాల బాల్‌నర్సయ్య, నిమ్మ రాజీవ్‌రెడ్డి, మంగోలు చంటి, మేడిశెట్టి శ్రీధర్, పుల్లంపల్లి కరుణాకర్, జింకల పర్వతాలు, గదరాజు చందు, శివగారి అంజయ్య, బూరగోని తిరుపతిగౌడ్, బీరెడ్డి ఇన్నారెడ్డి, పచ్చిమడ్ల సిద్దిరాములు, మంచాల కొండయ్య, పచ్చిమడ్ల మానస పాల్గొన్నారు.

## వైభవంగా కోటిలింగాల ఆలయ మహోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సిద్దిపేట టౌన్, మే 29: సిద్దిపేట పట్టణంలోని కోటిలింగాల దేవాలయ 46వ వార్షికోత్సవం మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవ వేడుకల్లో భాగంగా గురువారం వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలను నిర్వహించారు. లోక కల్యాణార్థం ఆలయ ఆవరణలో హోమం నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ మహోత్సవాలలో ఆలయ అనువంశిక ధర్మకర్త, చైర్మన్ తడకమడ్ల ఈశ్వరయ్య, డైరెక్టర్లు పొన్నమల్ల యాదగిరి, శ్రీనివాస్, మాధవి, అనుష, తదితరులు పాల్గొన్నారు.

## 'కొండా' చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాపోలు జ్ఞానేశ్వర్

సిద్దిపేట టౌన్, మే 29: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని జూన్ 2న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాల వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ చైర్మన్ రాపోలు జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. సిద్దిపేటలో గురువారం జరిగిన పద్మశాలి సంఘ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని ప్రభుత్వం తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి సతీష్ మాట్లాడుతూ తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న గొప్ప నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు శ్రీనివాస్, రాజేశం, బాల్‌రాజ్, బిక్షపతి, నాగరాజు, శ్రీనివాస్, శ్రీహరి, రవితేజ, ఆంజనేయులు పాల్గొన్నారు.

## పద్మశ్రీతో సత్కరించడం అభినందనీయం


చేర్యాలలో మాట్లాడుతున్న కిరణ్

చేర్యాల, మే 29: మందకృష్ణ మాదిగను పద్మశ్రీతో సత్కరించడం హర్షించదగ్గ విషయమని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు బంగారిగల్ల కిరణ్ అన్నారు. గురువారం నాడాయన చేర్యాలలో మాట్లాడుతూ మాదిగలకు ఎస్సీ వర్గీకరణ సాధించి, మాదిగ జాతి అభ్యున్నతి కొరకు గత 33ఏళ్లుగా మందకృష్ణ చేసిన కృషి అభినందనీయమన్నారు. ఆయనకు పద్మశ్రీ రావడం, రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోవడం మాదిగ సామాజిక వర్గం గర్వించదగ్గ విషయమన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి


విద్యార్థులతో దేశబోయిన నర్సింహులు

గజ్వేల్, మే 29: క్రీడలు శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యుడు దేశబోయిన నర్సింహులు అన్నారు. గురువారం మండల పరిధిలోని కొడకండ్ల పాఠశాల ఆవరణలో జిల్లా యువజన సంక్షేమ, క్రీడల శాఖ సహకారంతో నిర్వహిస్తున్న హ్యాండ్‌బాల్ ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని, శారీరక ఎదుగుదల ఎంతో అవసరమని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి ఇలాంటి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో పీటీ విశాల తదితరులు పాల్గొన్నారు.

## బాలుడిని కబలించిన రోటవేటర్

- మిరుదొడ్డి మండలం అల్వాలలో ఘటన


బీడ నికాస్ (ఫైల్)

మిరుదొడ్డి, మే 29: మిరుదొడ్డి మండలంలోని అల్వాలలో బుధవారం రోటవేటర్ కింద పడి బాలుడు దుర్మరణం చెందాడు. మిరుదొడ్డి హెడ్ కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ వివరాల ప్రకారం.. అల్వాలకు చెందిన బీడ లావణ్య, కనకయ్య దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. చిన్న కుమారుడు నికాస్ (5) తల్లిదండ్రులతో కలిసి గురువారం వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. బంధువుల వద్ద నుంచి తెచ్చిన ట్రాక్టర్‌ను కనకయ్య నడుపుతున్న క్రమంలో బాలుడు సైతం ట్రాక్టర్‌పై ఎక్కి కూర్చుంటానని మారాం చేశాడు. కనకయ్య ట్రాక్టర్‌కు రోటవేటర్‌ను అమర్చి తన కుమారుడిని తన పక్కన కూర్చోబెట్టుకుని చేనును దుక్కి చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బాలుడు కింద జారిపడి రోటవేటర్‌లో ఇర్కుకోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

## మురుగు..పరుగు



సిద్దిపేటలోని మూడో వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నాలాలు పొంగి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

- పొంగిపొర్లుతున్న అండర్‌గ్రౌండ్ నాలాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సిద్దిపేట, మే 29: ఒకప్పుడు స్వచ్ఛ పట్టణంగా దేశంలోనే ఆదర్శంగా నిలిచిన సిద్దిపేట మున్సిపాలిటీలో నేడు సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారు. సిద్దిపేట పట్టణంలోని చాలా కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నాలాలు నిండి రోడ్డుపై మురుగు ప్రవహిస్తున్నది. అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. పట్టణంలోని హుస్నాబాద్ రోడ్డులోని మూడో వార్డు మారుతీనగర్ హనుమాన్ టెంపుల్ రహదారిపై 20 రోజులుగా యూజీడీ నాలాలు నిండి రోడ్డుపై మురుగు ప్రవహిస్తున్నది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని కాలనీ వాసులు వాపోయారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై యూజీడీ ఏఈ పృథ్వీని 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా యూజీడీలో డైపర్ కవర్లు వేయడం వల్ల నాలాలు నిండి మురుగు రోడ్లపైకి వస్తుందన్నారు. మూడో వార్డులో యూజీడీ నిర్మాణం పూర్తి కాలేదని, పనులు పెండింగ్‌లో ఉండటం వల్ల కాంట్రాక్టర్‌ను మార్చినట్లు తెలిపారు. కొత్త కాంట్రాక్టర్ వచ్చిన తర్వాత పనులు చేయిస్తామని సమాధానం చెప్పారు.

# నకిలీ విత్తనాలపై నిఘా ఉంచాలి

- కలెక్టర్ మనుచౌదరి


టాస్క్‌ఫోర్స్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి


సమావేశానికి హాజరైన వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులు

సిద్దిపేట, మే 29: జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువుల సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ జిల్లాలో ఋతుపవనాలు ముందస్తుగా రావడంతో రైతులు విత్తనాలు విత్తేందుకు సమయాత్తమవుతున్నారని తెలిపారు. ఎక్కువ దిగుబడి ఆశ చూపుతూ దళారులు, వ్యాపారులు నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టే ప్రమాదముందని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయించకుండా జిల్లాలో టాస్క్‌ఫోర్స్ కమిటీ పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు ఆకస్మిక తనిఖీలను సైతం నిర్వహించాలన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో డీలర్లతో సమావేశాలు నిర్వహించాలని, లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోకి బయటనుంచి విత్తనాలు, ఎరువులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, వ్యవసాయ శాఖాధికారి రాధిక, ఏడీఏలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### నకిలీ విత్తనాలు, మందులు అమ్మితే చర్యలు


వర్గల్: గౌరారంలో తనిఖీలు చేపడుతున్న ఎస్సై, ఏవోలు

వర్గల్, మే 29: మండలంలోని ఆయా గ్రామాలలో గల ఫర్టిలైజర్ షాపుల యాజమాన్యం రైతులకు నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుల మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసకుంటామని గౌరారం, ఎస్సై కరుణాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారిణి శేషశయన తెలిపారు. గురువారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆయా ఫర్టిలైజర్ షాపులలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టాక్‌రిజిస్టర్లు, స్టాక్‌బోర్డ్‌పై వివరాలు, రికార్డులో రోజువారి డాటాను తప్పనిసరిగా మెయింటెన్ చేయాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రొబేషన్ ఎస్సై కీర్తిరాజు మరియే ఏఈవోలు పాల్గొన్నారు.

## పాఠశాలలను పునఃప్రారంభానికి సిద్ధం చేయాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సిద్దిపేట, మే 29: పాఠశాలల పునఃప్రారంభం నాటికి తరగతి గదులను శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, జూనియర్ కళాశాలల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యూనిఫాంలను ఆలస్యం కాకుండా విద్యార్థులకు అందించాలన్నారు. అల్పాహారం, మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు అందించాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి ఎక్కడా విద్యుత్, ఇతర రిపేర్లు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, డీబీసీడీఓ నాగరాజమ్మ, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అధిక దిగుబడినిచ్చే రకాలను ఎంచుకోవాలి


మాట్లాడుతున్న ఏడీఏ బాబునాయక్

గజ్వేల్, మే 29: రైతులు సాగు చేసే పంటల్లో అధిక దిగుబడినిచ్చే రకాలనే ఎంపిక చేసుకోవాలని ఏడీఏ బాబునాయక్ సూచించారు. గురువారం మండల పరిధిలోని అహ్మదీపూర్, శేర్‌పల్లి, దాతర్‌పల్లిలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో కలిసి గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను, సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా రైతులకు కలిగే లాభాలను వివరించారు. డ్రోన్ల ఉపయోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

## జూన్ 3నుంచి రెవెన్యూ సదస్సులు


మాట్లాడుతున్న తహసీల్దార్

మద్దూరు(ధూళిమిట్ట), మే 29: జూన్ 2 నుంచి అమలులోకి రానున్న భూభారతిపై జూన్ 3 నుంచి 9 వరకు మండలంలోని ఆయా గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు మద్దూరు తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్ గఫూర్ రహీం తెలిపారు. గురువారం మద్దూరులో ఆయన మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రధానంగా భూభారతిలో సాదాబైనామాలు, అప్పీల్, రెవెన్యూ కోర్టులు, పీవోటీ, సక్సేషన్ కేసులు పరిష్కారం కానున్నట్లు తెలిపారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఆర్ఐ అన్వర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### నంగునూరు మండలంలో...

నంగునూరు, మే 29: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన భూభారతి చట్టానికి సంబంధించిన రెవెన్యూ సదస్సులు మండల వ్యాప్తంగా జూన్ 3నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సరిత గురువారం ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్, ఆర్ఐ రెండు టీమ్‌లుగా ఏర్పడి సదస్సుల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. జూన్ 3న నాగరాజుపల్లి, మైసంపల్లి, 4న అంక్షాపూర్, నర్మెట(అప్పాలయచెరువు), 5న ఘనపూర్, నర్మెట, 6న ఖానాపూర్, ఖాతా, 9న పాలమాకుల, వెంకటాపూర్, 10న రాజగోపాల్‌పేట, అక్కెనపల్లి, 11న గట్లమల్యాల, ముండ్రాయి, 12న గట్లమల్యాల (సంతోష్‌నగర్), రాంపూర్, 13న నంగునూరు(సిద్దన్నపేట), మగ్దూంపూర్, 16న కొండంరాజుపల్లి, నంగునూరు, 17న బద్దిపడగ, తిమ్మాయిపల్లి, 18న బద్దిపడగ(దర్గపల్లి), కోనాయిపల్లి, 19న బద్దిపడగ(జేపీ తండా) గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

మర్కూక్, మే 29: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని మండల బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇప్పలగూడెంకు చెందిన కోడూరి చంద్రకళకు రూ.54వేలు, స్వామికి రూ. 60వేలు, కేశవరెడ్డికి రూ.24వేలు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరయ్యాయి. గురువారం బీఆర్‌ఎస్ నాయకులు కరుణాకర్‌రెడ్డిలతో కలిసి ఆయన బాధితులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆలయ పునః నిర్మాణ పనులకు భూమిపూజ


ఆలయ కమిటీ సభ్యులకు సామగ్రి అందజేస్తున్న దాతలు

మద్దూరు(ధూళిమిట్ట), మే 29: మద్దూరు మండలంలోని వల్లంపట్లలో ఆంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులకు గురువారం ఆలయ కమిటీ సభ్యులు భూమిపూజ నిర్వహించారు. ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పునఃనిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన పోగుల గౌరయ్య, రూ. లక్ష, గోపిశెట్టి కృష్ణహరి రూ. 50వేల విరాళాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి


పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై మహబూబ్

మద్దూరు(ధూళిమిట్ట), మే 29: ప్రశాంత వాతావరణంలో ప్రజలు పండుగలు జరుపుకోవాలని మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ కోరారు. గురువారం మద్దూరు పోలీస్ స్టేషన్‌లో రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకొని వివిధ గ్రామాలకు చెందిన పెద్ద మనుషులు, పీస్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎస్సై మాట్లాడుతూ సీపీ అనురాధ ఆదేశాల ప్రకారం గోవుల అక్రమ రవాణాతో పాటు గోవధ జరగకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆవులను కొనుగోలు చేసే సమయంలో రసీదులు పొందాలని, రసీదులు ఉన్నవాటిని మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. గ్రామాలలో జరిగే గోవుల అక్రమ రవాణాపై పోలీసులకు సమాచారాన్ని అందించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పండుగలను జరుపుకోవాలని సూచించారు.

## మొలకెత్తిన ధాన్యం



మూట్రాజ్‌పల్లి రింగ్‌రోడ్డుపై మొలకెత్తిన ధాన్యం ఆరబెట్టిన రైతు

గజ్వేల్, మే 29: అకాల వర్షాలకు రోడ్ల వెంబడి ఆరబెట్టిన వరిధాన్యం మొలకలొచ్చాయి. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు గత కొన్ని రోజులుగా మూట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు రింగు రోడ్డు వెంబడి ధాన్యాన్ని అరబెడుతూ ఆందోళన వ్యక్తం చేశారు.

## రోడ్డు భద్రత అందరి బాధ్యత

సిద్దిపేట టౌన్, మే 29: వర్షకాలంలో రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, ప్రమాదాల నివారణకు వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ సూచించారు. వర్షకాలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు తీసుకోవల్సిన జాగ్రతలను గురువారం వాహనాలను అధిక వేగంతో నడపవద్దని, వేగ పరిమితి కచ్చితంగా పాటించాలని సూచించారు. రోడ్లపై చెట్లు పడిపోయే అవకాశం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రెయిన్ కోట్, హెల్మెట్, సైడ్ మిర్రర్లను తప్పకుండా వాడాలని సూచించారు. అత్యవసర సమయంలో 100, లేదా 112, 91549 99999 ట్రాఫిక్ హెల్ప్‌లైన్ సహాయం పొందాలన్నారు.

# సర్కారు బడులను బలోపేతం చేద్దాం!


దుబ్బాక: సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు


మద్దూరు: మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు


గజ్వేల్‌లో జెండా ఎగురవేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

దుబ్బాక, మే 29: సర్కారు బడులను బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని దుబ్బాక ఎంపీడీవో భాస్కరశర్మ పిలుపునిచ్చారు. గురువారం దుబ్బాక ఎంపీడీవో కార్యాలయంలో బడిబాట కార్యక్రమంపై మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ బడులలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు దృష్టిసారించాలని ఆయన కోరారు. జూన్ 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎస్సై గంగరాజు, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు చంద్రకళ, స్వర్ణలత, ఎంపీవో నరేందర్ తదితరులున్నారు.

### పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలి

మద్దూరు(ధూళిమిట్ట), మే 29: తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలీ ఆహ్మద్ కోరారు. యూటీఎఫ్ చేపట్టిన బడిబాట ప్రచారజాత గురువారం మద్దూరు మండల కేంద్రానికి చేరుకున్నది. ఆయన మాట్లాడుతూ సర్కార్ బడులల్లో పిల్లల నమోదు పెంపునకు తమ సంఘం కృషి చేస్తున్నదన్నారు. బడిబాట ప్రచారజాత ద్వారా మద్దూరు మండలంలోని రేబర్తి, వల్లంపట్ల, ధూళిమిట్ట మండల కేంద్రంతో పాటు మండలంలోని బైరాన్‌పల్లి, తోర్నాల, కొండాపూర్ గ్రామాలలో ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేక మల్లేశం, జిల్లా కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, ఉపాధ్యక్షుడు చిర్ర యాదగిరి, కార్యదర్శులు కోడిపల్లి ప్రశాంత్‌కుమార్, శివలింగం, మద్దూరు మండల ప్రధాన కార్యదర్శి కాటం శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు తలారి కనకయ్య, గణేశ్‌రెడ్డి, రాజిరెడ్డి, పిల్లి రాజు, శనిగరం చంద్రయ్య. లక్ష్మినర్సయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

### పాఠశాలల బలోపేతానికి టీపీటీఎఫ్ కృషి

గజ్వేల్, మే 29: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు తమ సంఘం కృషి చేస్తుందని టీపీటీఎఫ్ జోన్ కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం గజ్వేల్‌లోని జోన్ కార్యాలయ ఆవరణలో జెండా ఎగురవేసి ఘనంగా జరుపుకొన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు జిల్లావ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్, రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, సీనియర్ నాయకులు రామచంద్రం, ఎల్లయ్య, శంకర్, మల్లయ్య, నర్సింహులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య


సిద్దిపేట జిల్లా చేర్యాలకు చేరుకున్న టీఎస్‌యూటీఎఫ్ బడిబాట ప్రచార జాత

చేర్యాల, మే 29 : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్య పొందాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వలీ అహ్మద్ కోరారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపుదల కోసం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలోని 26 మండలాల్లో చేపట్టిన బడిబాట ప్రచారజాత గురువారం చేర్యాలకు చేరుకుంది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని, అన్ని వసతులు ఉన్నందున తల్లిదండ్రులు వారి పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, నాయకులు పుర్మ ఆగంరెడ్డి, ఆడెపు చంద్రయ్య, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, వకులాభరణం నర్సయ్య పంతులు, ఎంఈవో రచ్చ కిష్టయ్య, నాయకులు తప్పెట్ల యాదగిరి, చిర్ర యాదగిరి, కొడిపల్లి ప్రశాంత్ కుమార్, టి.శివలింగం, తలారి కనకయ్య, పిల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన గజ్వేల్ ఏసీపీ


కలెక్టర్ మనుచౌదరికి పూలమొక్క అందజేస్తున్న ఏసీపీ నర్సింహులు

గజ్వేల్, మే 29: గజ్వేల్ ఏసీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నర్సింహులు కలెక్టర్ మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పూలమొక్కను అందజేశారు.

### నేడు రైతులకు అవగాహన సదస్సు

హుస్నాబాద్ టౌన్, మే 29: ఆయిల్‌పామ్ పంటసాగుపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు హుస్నాబాద్ ఏడీఏ శ్రీనివాస్ గురువారం ప్రకటనలో తెలిపారు. పోతారం(ఎస్) శుభం గార్డెన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం, కలెక్టర్ మనుచౌదరి హాజరవుతున్నట్లు తెలిపారు. రైతులు పెద్దసంఖ్యలో సదస్సుకు హాజరు కావాలని కోరారు.

### ఆలయానికి సామగ్రి అందజేత

మర్కూక్, మే 29: మండల పరిధిలోని వరదరాజ్‌పూర్‌లోని పురాతన వరదరాజ స్వామి ఆలయానికి సామగ్రి అందజేయడానికి గజ్వేల్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. 1984–85 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న నరసింహరెడ్డి, రమణరావు, లక్కాకుల నరేశ్ గురువారం ఆలయ పూజారులకు 4 ఫ్యాన్లు, ఏసీని విరాళంగా ఇచ్చారు. అలాగే తొడుమునూరి విజయసారథి మంజుల, రమణరావు, సాయిరాం హారతి సమయంలో మోగించే గంటను విరాళంగా ఇచ్చారు. అలాగే సంతోష్‌కుమార్ దేవాలయానికి పల్లకిని అందించడానికి ముందుకొచ్చారు. ఆలయ నిర్వహకులు దాతలను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎంపీటీసీ మృతి

చేర్యాల, మే 29: మండలంలోని వీరన్నపేట మాజీ ఎంపీటీసీ మొగుళ్ల విష్ణువర్ధన్ రెడ్డి గురువారం సిద్దిపేటలో గుండెపోటుతో మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎంపీటీసీల వ్యవస్థ ప్రారంభంలోనే వీరన్నపేట ప్రథమ ఎంపీటీసీగా విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. మాజీ ఎంపీటీసీ మృతిపట్ల ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ కొండపాక భిక్షపతి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

### నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదు

గజ్వేల్, మే 29: మున్సిపల్ పరిధిలోని వ్యాపారులు, దుకాణదారులు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని కమిషనర్ గోల్కొండ నర్సయ్య సూచించారు. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాలనుసారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్, 120 మైక్రాన్ల కన్నా తక్కు వ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు నిషేధించడం జరిగిందన్నారు. నిషేధిత కవర్లను నిల్వచేసినా, అమ్మినా, రవాణా చేసినా చర్యలు తీసుకుంటామన్నారు.

### మురుగుకాల్వ పనుల పరిశీలన

హుస్నాబాద్‌టౌన్, మే 29: పట్టణంలోని 14వ వార్డులో నిర్మించిన మురుగుకాల్వ పనులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ గురువారం పరిశీలించారు. కాల్వపనులు సక్రమంగా నిర్వహించలేదనే ఆరోపణలపై వారు పరిశీలించారు. ఎక్కడ కూడా వరదనీరు కాలనీలోకి నిల్వ ఉండకుండా మురికి కాల్వల ద్వారా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ కాలనీవాసులకు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ పృథ్వీ ఉన్నారు.

### రేషన్ డీలర్ అరెస్ట్

నంగునూరు, మే 29: వివాహితపై లైంగిక దాడికి యత్నించిన రేషన్ డీలర్‌ను, సహకరించిన అతని మిత్రుడిని రాజగోపాల్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ఎండీ ఆసిఫ్ వివరాల ప్రకారం.. మండలంలోని పాలమాకులకు చెందిన రేషన్ డీలర్ సంపంగి మహేష్ మండలంలోని ఓ గ్రామంలో తనకు పరిచయం ఉన్న మహిళపై బుధవారం రాత్రి లైంగికి దాడికి యత్నించాడు. మహేష్ తన స్నేహితుడు పల్లెపు సంపత్‌తో కలిసి బైక్‌పై బాధిత మహిళ పుట్టింటికి వెళ్లారు. సంపత్‌ను ఇంటిబయట కాపలా ఉంచిన మహేష్ ఇంట్లోకి చొరబడి మహిళపై లైంగికి దాడికి యత్నించగా మహిళ కేకలు వేయగా, ఆమె తల్లిదండ్రులు, చుట్టుపక్కలవారు నిద్రలేచారు. దీంతో వారిద్దరూ బైక్‌పై పారిపోయారు. మహిళ ఫిర్యాదు మేరకు నిందితులిద్దరిని గురువారం అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆసిఫ్, ప్రొబేషనరీ ఎస్సై సౌజన్య తెలిపారు.

### మరమ్మతులు చేపట్టాలి

హుస్నాబాద్‌టౌన్, మే 29: పట్టణంలోని ఇండోర్ స్టేడియానికి మరమ్మతులు చేయించాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రకటనలో డిమాండ్ చేశారు. స్టేడియం కిటికీలు పగిలిపోయాయని, షటిల్ కోర్డులోని ఉడెన్ సైతం ధ్వంసమైందని, తక్షణమే మరమ్మత్తులు చేసి నిర్వహణ బాధ్యతలను ఒకరికి అప్పగించాలని కోరారు.